క్లుప్తంగా

హరీశ్‌రావుకు సన్మానం

దుగ్గొండి : మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావును జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, తదితర బీఆర్‌ఎస్ నాయకులు గిర్నిబావిలో గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. తొలుత నర్సంపేట వెళ్తున్న హరీశ్‌రావుకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, మాజీ ఎంపీపీ కాట్ల భద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు వంగేటి అశోక్, కంచరకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, పెండ్యాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రగూడెంలో..

నల్లబెల్లి : నర్సంపేట నుంచి సిద్దిపేటకు వెళ్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును మండలంలోని రుద్రగూడెంలో బీఆర్‌ఎస్ నాయకులు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ స్వప్న, తదితరులు హరీశ్‌రావును శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, బానోత్ హరినాథ్‌సింగ్, గందె శ్రీనివాస్ గుప్తా, తక్కళ్లపల్లి మోహన్‌రావు, ఇంగ్లె శివాజీ, మామిండ్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలో ప్రతిభ



వర్ధన్నపేట : ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జరిగిన ఆల్ ఇండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలో అండర్ –13 విభాగంలో స్థానిక ఎస్సై చందర్ కుమార్తె మనస్విని ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచింది. చిన్నారి కాంస్య పతకం సాధించగా ఆమెను బంధువులు, కుటుంబ సభ్యులు అభినందించారు. భవిష్యత్తులో మరింగా రాణించాలని ఆకాంక్షించారు.

కమిటీ ఎన్నిక


శ్రీనివాస్


సామ్యూల్

నర్సంపేట : ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అలువాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కేశపాక వంశీ, ప్రధాన కార్యదర్శిగా పసునూరి సామ్యూల్, కార్యదర్శిగా చెరిపెల్లి అఖిల్, కార్యదర్శిగా మంతెన బాబు, కోశాధికారిగా పసునూరి రఘు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా శ్రావణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా దిలీప్, రాజు, శ్రావణ్, శేఖర్, సాగర్, బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని నాయకులు అభినందించారు.

ఆటో యూనియన్ కార్యవర్గం..

దుగ్గొండి : మండల కేంద్రంలో ఐఎన్‌టీయూసీ అనుబంధ ఆటో యూనియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బండి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా ద్యాగం శివాజీ, ప్రధాన కార్యదర్శిగా నేదురు రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులుగా అలువాల రాజు, కొలిపాక కోటిలింగం, భూక్యా సతీశ్, సహాయ కార్యదర్శిగా కిస్టోజు సాంబాచారి, కార్యదర్శులుగా గుండెబోయిన చిరంజీవి, అంబరగొండ రాజబాబు, కార్యనిర్వాహణాధికారిగా వెండి సూర్య, సభ్యులుగా జనగాం మహేశ్, మాదాసి సూరయ్య, దండు శ్రీనివాస్, గుండెబోయిన రాజు, బొడిగె చిరంజీవి, గొర్రె నవీన్, మంద అశోక్, చందా మణికంఠ, సలహాదార్లుగా గైని భాస్కర్, నేదురు రాజశేకర్, రాంపాక భాస్కర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీరు బాటిళ్లలో ఫంగస్, సోంపు



వర్ధన్నపేట : బీర్ బాటిళ్లలో ఫంగస్, సోంపు ప్యాకెట్ రావడం మండలంలో ఇల్లంద గ్రామంలో గురువారం కలకలం రేపింది. ఆ గ్రామంలోని ఓ వైన్ షాపులో సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సదరు కంపెనీ యాజమాన్యం సీసాలను శుద్ధి చేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని మద్యం ప్రియులు మండిపడుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దామెర : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి చెప్పారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని మైనారిటీ, సాంఘిక సంక్షేమ, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలను గురువారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. ఆమె వెంట ఆర్‌ఐ సంపత్, ప్రిన్సిపాళ్లు రమేశ్‌లాల్, సురేశ్ కుమార్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

సర్కారు బడుల్లో లైబ్రరీ పీరియడ్

● నిర్వహణ దిశగా ముందస్తు శిక్షణ

దుగ్గొండి : విద్యార్థుల్లో అధ్యయనం పట్ల ఆసక్తి పెంచేలా ప్రభుత్వం సర్కారు బడుల్లో లైబ్రరీ పీరియడ్ నిర్వహణకు చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్ తరగతులు ఉండగా ఇక నుంచి రోజూ 45 నిమిషాల పాటు లైబ్రరీ పీరియడ్ నిర్వహించనున్నారు. లైబ్రరీ తరగతి నిర్వహణ కోసం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తొలుత రిసోర్స్‌పర్సన్లకు, అనంతరం స్కూల్ కాంప్లెక్స్‌ల వారీగా ఉపాధ్యాయులకు ముందస్తుగా శిక్షణ ఇచ్చారు. మండలంలో 7 ప్రభుత్వ హైస్కూళ్లు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలు, 17 ప్రాథమిక పాఠశాలలతోపాటు మూడు గురుకుల (కేజీబీవీ, ఎంజేపీ, టీఎస్ డబ్ల్యూఆర్) విద్యాలయాలుండగా వాటిలో గ్రంథాలయాల తరగతిని తప్పనిసరి చేశారు. మండలంలోని మొత్తం 34 స్కూళ్లలో లైబ్రరీ తరగతులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్కూళ్లలో 963, గురుకుల విద్యాలయాల్లో 1100 మంది విద్యార్థులున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

విద్యార్థులకు విజ్ఞానం పెంచే పుస్తకాలు

విద్యార్థుల తరగతులకు అనుగుణంగా సమగ్ర శిక్షణా అభియాన్ ద్వారా ప్రభుత్వ విద్యాలయ శాఖ పుస్తకాలను సమకూర్చింది. విద్యార్థులకు క్రమశిక్షణ అలవర్చేలా అవసరమైన పుస్తకాలు రూపొందించారు. హైస్కూళ్ల విద్యార్థులకు కరెంట్ అఫైర్స్, జీకే, తదితర పుస్తకాలు అందించగా ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం రంగు రంగుల చిత్రాలతో కూడిన, మహనీయుల జీవిత చరిత్రలను తెలిపే పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అన్ని తరగతుల్లోనూ ఓ వైపు పుస్తకాలు అందుబాటులో ఉంచి విద్యార్థులు అధ్యయనం చేసేలా ఏర్పాట్లు చేశారు. అన్ని స్కూళ్లలో లైబ్రరీ పీరియడ్ నిర్వహించాలంటూ ఉన్నతాధికారుల నుంచి పాఠశాలలకు ఆదేశాలు జారీ అయ్యాయి.


నాచినపల్లి హైస్కూల్ లైబ్రరీ తరగతిలో విద్యార్థులు

అధ్యయనంతో జ్ఞాన సముపార్జన

లైబ్రరీ తరగతుల్లో అందుబాటులో ఉన్న పుస్తకాల అధ్యయనంతో విద్యార్థుల్లో జ్ఞాన సముపార్జనకు బాటలు పడతాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని స్కూళ్లలో గ్రంథాలయాలు ఏర్పాటు చేశాం. ప్రతిరోజు పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థుల్లో పఠనాశక్తితోపాటు మేథాశక్తి పెరుగుతుంది. క్రమశిక్షణ అలవడుతుంది. మహనీయుల చరిత్ర అవగతమవుతుంది.

\- వెంకటేశ్వర్లు, ఎంఈఓ

‘చిన్నారి లోకం’లో విద్యార్థులు


దుగ్గొండి : పాట పాడుతున్న విద్యార్థులు

దుగ్గొండి : హనుమకొండలోని ఆకాశవాణి వరంగల్ రేడియో కేంద్రంలో గురువారం నిర్వహించిన ‘చిన్నారి లోకం..’ కార్యక్రమంలో మండలంలోని నాచినపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు సందడి చేశారు. 78వ దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వెల్దండి సుమలత ఆధ్వర్యంలో ప్రత్యేక కదంబ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన మహిళా యోధులను శ్రోతలకు పరిచయం చేశారు. దేశభక్తి గేయాలు ఆలపించి అలరించారు. ‘మన భవిష్యత్-పర్యావరణ కాలుష్యం’పై నాటకం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు సుమలత మాట్లాడారు. ఈనెల 17న ఉదయం 9.30 గంటలకు రేడియోలో కార్యక్రమం ప్రసారం కానుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జూలూరి జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుకు ప్రాధాన్యం

● కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి


నర్సంపేట : లబ్ధిదారులతో వెంకట్‌రెడ్డి

నర్సంపేట : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయినిపహాడ్, పాపయ్యపేట గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డుల ప్రతులను నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్‌తో కలిసి వెంకట్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డులను అందించలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు రాజు, మమత, మాజీ ఉపసర్పంచ్ అరులయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగ్ధుంపురంలో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్దుంపురంలో లబ్ధిదారులకు రేషన్ కార్డుల ప్రతులను మాజీ ఎంపీటీసీ చీకటి స్వరూప ఓదయ్య పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెన్నారావుపేట సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపీ, తదితరులు పాల్గొన్నారు.

‘సఖి’ సేవలు వినియోగించుకోవాలి

● కేస్ వర్కర్ స్వప్న


కరపత్రాలను ప్రదర్శిస్తున్న స్వప్న, తదితరులు

రాయపర్తి : సఖి కేంద్రాల్లో లభిస్తున్న సేవలను బాధిత మహిళలు, బాలికలు, వృద్ధులు వినియోగించుకోవాలని సఖి సెంటర్ కేస్ వర్కర్ స్వప్న కోరారు. మండలంలోని కొత్తూరులో గురువారం వీఓ సమావేశం నిర్వహించారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి కేంద్రాల్లో లభించే సేవలపై అవగాహన కల్పించేలా ముద్రించిన కరపత్రాలను స్వప్న ఆధ్వర్యంలో ప్రదర్శించారు. మహిళా హక్కులు, చట్టాలు, బాల్యవివాహాలపై వివరించారు. అనంతరం స్వప్న మాట్లాడారు. సమస్యలు ఎదుర్కొంటున్న మహిళల, బాలికల, వృద్ధులకు ఉచిత కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సాయంతోపాటు అవసరమైన తాత్కాలిక వసతి సైతం కల్పిస్తారని చెప్పారు. సఖి కేంద్రంలో లభిస్తున్న సేవలపై మహిళలు, బాలికలు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు విద్యావతి, అమలాదేవి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

● ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు సూరన్న


సమావేశంలో మాట్లాడుతున్న సూరన్న

గీసుకొండ : పోరాటాల ద్వారానే దివ్యాంగుల సమస్యలు పరిష్కారమవుతాయని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశానికి సూరన్న హాజరై మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు అనేక హామీలు అధికారంలోకి వచ్చాక విస్మరించిందని చెప్పారు. ఈనెల 25న గీసుకొండ, నల్లబెల్లి, దుగ్గొండి మండలాల పెన్షనర్లకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మంద కృష్ణ దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఉపాధ్యక్షుడు ఇనుముల పూర్ణయ్య, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు, నాయకులు దామెర కిశోర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిపై ఫిర్యాదు



ఎంజీఎం : హనుమకొండలోని సంకీర్తన ఆస్పత్రిపై వరంగల్ జిల్లా పరిధిలోని చెన్నారావుపేట మండలంలోని 16 చింతల్‌తండా మాజీ సర్పంచ్ బానోత్ గణేశ్‌నాయక్ హనుమకొండ జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ అల్లెం అప్పయ్యకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడారు. తనపై తండాకు చెందిన కొందరు దాడి చేయగా తాను తీవ్ర గాయాలపాలై సంకీర్తన ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నట్టు తెలిపారు. తొలుత తనకు తీవ్ర గాయాలైనట్టు ఆస్పత్రి వైద్యుడు జాటోతు రవికుమార్ గుర్తింపు చికిత్స చేశాడని, తదనంతరం ఎంఎల్‌సీ కేసు నేపథ్యంలో తనపై దాడి చేసిన వారితో కుమ్మక్కై రిపోర్టు మార్చాడని ఆరోపించారు. వైద్యుడి తీరుపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరాడు. ఫిర్యాదు చేసిన వారిలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్మయ్య రాథోడ్, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు పుట్ట రవి, రాష్ట్ర అధికార ప్రతినిధి లకావత్ కరుణాకర్, పీపుల్స్ డెమోక్రటిక్ మూమెంట్ జాతీయ కన్వీనర్ పోరిక ఉదయ్ సింగ్, తదితరులున్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు



రాయపర్తి : మండలంలోని గణేశ్‌కుంటతండాలో గిరిజనులు గురువారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గోధుమలతో తయారు చేసిన బతుకమ్మలతో సందడి చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోధుమలతో తయారు చేసిన బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని కిష్టాపురం క్రాస్ రోడ్డులోని రైస్‌మిల్ యజమాని వల్లపు వెంకన్న అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన్ను మాజీ మంత్రి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. అనారోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు..

సంగెం : మండలంలోని నర్సనగర్‌లో మాడిశెట్టి ఐలమ్మ, సంగెంలో పులి వరమ్మ, కాట్రపల్లిలో మేకల కొమురమ్మ, ఆశాలపల్లిలో బోల్ల కొమురమ్మ, నాగబెల్లి సుదర్శన్ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం పరామర్శించారు. ఆయన తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. తదనంతరం నర్సనగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు కాల్వ అశోక్‌ను కలిసి మాట్లాడారు. అనారోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, సాగర్ రెడ్డి, సదానందం, మల్లయ్య, కుమారస్వామి, బాబు, సదయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సేవా దృక్పథం అవసరం

● మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న హరీశ్‌రావు, పెద్ది

నర్సంపేట : వైద్యులకు సేవా దృక్పథం అవసరమని తెలంగాణ రాష్ట్ర మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆకాంక్షించారు. పట్టణంలోని నెక్కొండ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన గ్రీన్ స్టార్ ఆస్పత్రిని తెలంగాణ మాజీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. రోగులు వరంగల్, హన్మకొండ, తదితర దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా అత్యాధునిక పరికరాలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభించడం శుభ పరిణామన్నారు. పేదలకు లాభాపేక్ష లేకుండా తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, సతీశ్ రెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, డైరెక్టర్లు శానబోయిన రాజ్ కుమార్, గోనె యువరాజు, పాషా, సంతోశ్‌రెడ్డి, సాంబాజీ, చారి, కాసర్ల నర్సింహారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ సత్యశారద


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

సంగెం : వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యశారద కోరారు. మండలంలోని ఎల్గూర్ రంగంపేట చెరువు మత్తడి ఉధృతిని, రైల్వే అండర్ బ్రిడ్జిని గురువారం ఆమె సందర్శించారు. చెరువు మత్తడి నీరు ఏయే గ్రామాల మీదుగా ఎక్కడికి వెళ్తుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మత్తడి నీటితో కింద ఉన్న గ్రామాలకు ముంపుపై ఆరా తీశారు. నీరు ఉధృతి క్రమంలో రాకపోకలకు అంతరాయం కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమాలోచన చేశారు. మత్తడి పోస్తున్నప్పుడు ద్విచక్రవాహనాలు, బాటసారులు వెళ్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చెరువు వద్ద సెల్ఫీ దిగుతున్న యువతను కలెక్టర్ మందలించారు.

ఆర్‌యూబీపై జాయింట్ కమిటీ ఏర్పాటు

ఆర్‌యూబీ సైడ్ గోడల ద్వారా వస్తున్న నీటి ఊటను, వరద నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బావి, నీటి పంపింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎల్గూర్ రంగంపేట నుంచి అటు మొండ్రాయి వైపు చెరువు మత్తడి నీరు, ఇటు సంగెం వైపు వెళ్లకుండా రైల్వే అండర్ బ్రిడ్జిలో చేరడంతో రెండ్రోజులపాటు జలదిగ్బంధంలో ఉన్నట్లు గ్రామస్తులు కలెక్టర్‌కు తెలిపారు. అనారోగ్యం పాలైన వ్యక్తిని మంచంపై రైల్వే పట్టాలు దాటించి 108 ఎక్కించామని చెప్పారు. గ్రామానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుంటే ఇబ్బందులు తప్పవని మాజీ సర్పంచ్‌లు జనగామ రమేశ్, పోతుల ప్రభాకర్ చెప్పారు. దీంతో కలెక్టర్ స్పందించారు. అండర్ బ్రిడ్జి నిర్మాణంపై అధికారులతో జాయింట్ కమిటీ వేస్తామని భరోసా ఇచ్చారు. నీరు నిల్వకుండా అధ్యయనం చేసి అధికారులు ఇచ్చిన నివేదికను జీఎంకు అందజేసి సమస్య పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఐబీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీత, డీఈ గణేశ్, పీఆర్ డీఈ జ్ఞానేశ్వర్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సమైక్యతను కాపాడుతూ దేశభక్తి నింపాలి



నర్సంపేట : జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి, తదితరులు

● బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : ప్రజలందరూ భారత జాతి సమైక్యతను కాపాడుతూ భవిష్యత్ తరాల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలోని అమరులవీరుల స్తూపం నుంచి పాఖాల్ సెంటర్ వరకు గురువారం ‘హర్ ఘర్ తిరంగా యాత్ర’ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాణాప్రతాప్‌రెడ్డి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ సందేశం ప్రతి గుండెనూ తాకుతోందని చెప్పారు. దేశ భద్రత కోసం ప్రధాని నిరంతరం తపిస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా ఎగరేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, సీనియర్, ముఖ్యనాయకులు, నియోజకవర్గ, మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూనె అనిల్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్లకొండ రవి, జిల్లా నాయకుడు గడ్డం నరేందర్, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్‌కుమార్, నాయకులు నిమ్మల అనిల్, మందపురి రాజు, రాపాక ప్రశాంత్, పెండ్యాల గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండల కేంద్రంలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొక్కం శ్రీనివాస్ మాట్లాడారు. భారత్ మాతాకీ జై, వందే మాతరం, జై జవాన్, జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, నాయకులు జాన్ విక్రం, నల్ల సాంబరాజు, ఆరకట్ల ప్రవీణ్, ఆకుల వెంకన్న, అఖిల్, కత్తి వెంకన్న, ఎంబాడి రాజశేఖర్, కత్తి రమేశ్, కందికొండ ప్రదీప్, ముల్క సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న రాములు

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన కందికొండ అనిల్, ఈసంపెల్లి మింటు, పైస వినోద్, మండల రజితలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ ఆవుల రాములు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మండల నర్సింహరాములు, నాయకులు కల్లెపు రవీందర్, మైదం ప్రభాకర్, పయిండ్ల యాకయ్య, పసునూటి మాణిక్యం, కల్లెపు ఎల్లగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడికి..

పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు బెజ్జంకి ప్రభాకర్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మాజీ వార్డు మెంబర్లు కొయ్యడి సంపత్, గాజుల రమేశ్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభాకర్ ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకోగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గిరగాని కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఆంజనేయులు (ఫైల్)

రాయపర్తి : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మొరిపిరాల క్రాస్‌లో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని పెర్కవేడుకు చెందిన గాదె ఆంజనేయులు (28) జమ్మికుంట నుంచి బోనాల పండుగకు ఈనెల 13న భార్యతో కలిసి వచ్చాడు. అదేరోజు సాయంత్రం రాయపర్తికి వెళ్లాడు. రోడ్డు ప్రమాదంలో ఆంజనేయులు చనిపోయాడని గురువారం తెల్లవారుజామున పోలీసులు కుటుంబీకులకు సమాచారం అందించారు. జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఏడు నెలల పాప ఉంది.

నీటమునిగి పశువుల కాపరి..

పర్వతగిరి : నీటమునిగి పశువుల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని నారాయణపురంలో జరిగింది. వివరాలిలా.. గ్రామానికి చెందిన కందికట్ల ఉప్పలయ్య ఈనెల 11న మధ్యాహ్నం పశువులను మేపడానికి వెళ్లి రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఆయన కుమారుడు దయాకర్ అదేరోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆకేరు వాగు వద్ద ఉప్పలయ్య బట్టలు, చెప్పులు, గొడుగు కనిపించాయని ఆయన కుటుంబ సభ్యులకు బంధువు ఒకరు ఫోన్‌లో ఈనెల 13న సమాచారం అందించడంతో వెళ్లి పరిశీలించారు. పోలీసులు ఎస్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆకేరు వాగు వద్ద పరిశీలించి ఉప్పలయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం ఎంజీఎంకు తరలించారు. ఉప్పలయ్య ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడని అధికారులు ధ్రువీకరించినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు.

మద్యం మత్తులో వీరంగం

గీసుకొండ : మద్యం మత్తులో యువకుడ వీరంగం సృష్టించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోట చంటి గురువారం అదే గ్రామానికి చెందిన వివాహిత కంత్రి మరియ ఇంటికి ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో వెళ్లి బూతులు తిడుతూ ఆమెను కర్రలతో ఇష్టారీతిన చితకబాదాడు. అలాగే, కుక్కలను ఎందుకు పెంచుతున్నావంటూ మంద రాజు అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఆయన దవడపై రాయితో మోదాడు. దీంతో రాజు ఐదు పండ్లు విరిగిపోయాయి. ఈ ఘటన గ్రమంలో కలకలం సృష్టించింది. బాధితులు మరియ, రాజు అందించిన ఫిర్యాదు మేరకు చంటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.